# సర్కారుకు రైతుల ఉసురు



చీకురాయి శివారులో ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, చందర్

- నీళ్లియ్యక పంటలు ఎండబెట్టిన పాపం ఊరికే పోదు
- పరిహారం ప్రకటించకుంటే 30, 31 తేదీల్లో రైతు దీక్షలు: కొప్పుల

పెద్దపల్లి, మార్చి 27: 'కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కింది. ఇచ్చిన వాగ్దానాల అమలు పక్కన పెడితే.. రైతులకు కనీసం సాగునీరు ఇవ్వకుండా ఏడ్పిస్తున్నది. ఆ పాపం ఊరికే పోదు.. కాంగ్రెస్ సర్కార్‌కు తప్పకుండా రైతుల ఉసురు ముడ్తది' అని బీఆర్ఎస్ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. బుధవారం పెద్దపల్లి మండలం భోజన్నపేట, చీకురాయి గ్రామాల శివారులో సాగునీరందక ఎండిన వరిపంటలను ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తొమ్మిదిన్నరేండ్లలో రైతులకు ఏనాడూ సాగునీటి కష్టాలు రానివ్వలేదని, ఎక్కడా ఒక్క ఎకరం ఎండిపోకుండా నీరందించామని చెప్పారు. కాంగ్రెస్ మూడు నెలల పాలనలోనే ముప్పు తిప్పలు పెడుతున్నదని దుయ్యబట్టారు. ఎండిన ప్రతి ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో రైతు నిరసన దీక్షలు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు.

# కన్నీరు పెట్టిస్తున్న కాంగ్రెస్ సర్కార్



రేగొండలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

- నీళ్లులేక పంటలు ఎండుతున్నా పట్టించుకోని పాలకులు
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి విమర్శ
- రేగొండ మండలంలో ఎండిన పంటల పరిశీలన

రేగొండ, మార్చి 27: నీళ్లు లేక పంటలు ఎండుతుండటంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని, అయినా ఈ కాంగ్రెస్ సర్కార్ కనికరించడం లేదని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. బుధవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ, చెంచుకాలనీ, తిరుమలగిరి గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత పదేండ్లుగా పంటలు సాగు చేస్తున్నా ఎన్నడూ సాగునీరులేక పంటలు ఎండిపోలేదని, ఈ ఏడాది పంట చేతికందే దశలో నీళ్లు లేక పశువులను మేపుతున్నామని రైతులు వాపోయారు. ఎకరానికి రూ. 30 వేల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలంటూ రైతులు కోరుతున్నారు. మధుసూదనాచారి జిల్లా వ్యవసాయ, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పంట నష్టం అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. సిరికొండ మాట్లాడుతూ.. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో సాగు నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు రోడ్డున పడ్డారని తెలిపారు. రేగొండ మండలంలో 250 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని, ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లెలో ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

# రైతును ఆదుకోకపోతే ఉద్యమిస్తాం

- పంటలు ఎండుతున్నా పట్టించుకోని సర్కార్
- మాజీ ఎమ్మెల్యే గండ్ర
- భూపాలపల్లి జిల్లా రంగయ్యపల్లెలో పంటల పరిశీలన

రేగొండ, మార్చి 27: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రంగయ్యపల్లెలో మాజీ ఎమ్మెల్యే గండ్ర ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏడాది పొడవునా బీఆర్ఎస్ ప్రభుత్వం డీబీఎం 38 కాల్వల ద్వారా సాగునీరు అందించినట్టు చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క రోజు కూడా సాగునీరు రాలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. రూ.రెండు లక్షల రుణ మాఫీ, ఎకరానికి రూ.15 వేల రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులైనా రుణ మాఫీ ఊసేలేదని విమర్శించారు. ఈయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు లెంకల రాజిరెడ్డి, సామాల పాపిరెడ్డి, ఈర్ల సదానందం, సూర నర్సింగరావు, గోపు భిక్షపతి, దగ్గు వెంకటేశ్వర్‌రావు, బండి రమేశ్ తదితరులు ఉన్నారు.



సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే రసమయి

# 2 లక్షల రుణమాఫీ ప్రకటించండి

- రైతులను బ్యాంకర్లు అప్పులు అడగకుండా జీవో జారీ చేయాలి
- ఎండిన, దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్

బెజ్జంకి/వీణవంక, మార్చి 27: ఓ వైపు సాగునీళ్లు లేక చేతికందే దశలో పంటలు ఎండిపోయి.. మరోవైపు అకాల వర్షంతో ఉన్న కాసిన్ని పంటలు దెబ్బతిని రైతులు అవస్థలు పడుతుంటే బ్యాంకు అధికారులు రుణాలు చెల్లించాలని రైతులను వేధిస్తున్నారని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను బ్యాంకర్లు అప్పులు అడగకుండా జీవో జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో నీళ్లులేక ఎండిన, అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వెంటనే రూ.2 లక్షల రుణమాఫీని ప్రకటించాలని కోరారు. మేడిగడ్డ బ్యారేజ్ వద్ద కాపర్ డ్యాం నిర్మించినట్లయితే రాష్ట్రంలో కరువు వచ్చే పరిస్థితి వచ్చేది కాదని, ఇది కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా మేడిగడ్డ వద్ద కుంగిన పిల్లర్లకు మరమ్మతులు చేపట్టకుండా బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని పంటలకు సాగు నీరందించి కాపాడే అవకాశం ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో మళ్లీ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలే పరిస్థితి మొదలైందని, గ్రామాల్లో మళ్లీ మోటర్ వైండింగ్ దుకాణాలు తిరిగి ప్రారంభమయ్యాయని చెప్పారు. కాగా.. కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలో ఓ కార్యక్రమానికి కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై వస్తుండగా బస్టాండ్ ఆవరణలో మోటర్ వైండింగ్ చేస్తున్న శ్రీనివాస్ కనిపించాడు. దీంతో వినోద్‌కుమార్ శ్రీనివాస్ వద్దకు వెళ్లి మాట్లాడారు. గతంలో మోటర్లు ఎన్ని కాలేది? ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్ని మోటర్లు కాలుతున్నాయి? అని అడగగా.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యమైన కరెంట్ రావడం వల్ల మోటర్లు కాలకపోయేదని, మొన్నటి సంది మోటర్లు చాలా కాలిపోయి రిపేర్‌కు వస్తున్నాయని శ్రీనివాస్ బదులిచ్చాడు.



## 'కాంగ్రెస్‌కు ఓటేసినందుకు చెప్పుతో కొట్టుకుంట'

కోటి ఆశలతో యాసంగి పంట సాగు చేస్తే నిరాశే ఎదురైంది. కేసీఆర్ సార్ పాలనలో పదేండ్లుగా పంటలు సాగు చేసిన. అట్లనే ఉంటదని యాసంగికి నారు పోసిన. డిసెంబర్‌లో డీబీఎం 38 కాల్వ ద్వారా నీళ్లొత్తున్నాయని మూడు ఎకరాల్ల వరి వేసిన. 3 బస్తాలు వరి నారు అలికిన. జనవరిలో 10 రోజులపాటు మళ్ల నీళ్లొత్తున్నాయని నాట్లేసిన. కూలీలు దొరక్కున్నా అప్పు చేసి ఎక్కువిచ్చి పంటలు సాగు చేసిన. కాల్వ నీళ్లు రాకపోవడంతో బాయి నీళ్లు పొలానికి పెట్టిన. బాయిల కూడ నీరు అడుగంటింది. వరి పంట పొట్ట దశకు చేరినంక నీరులేక మొత్తం ఎండిపోయింది. రూ.78 వేల పెట్టుబడి బూడిదిల పోసినట్లయ్యింది. పదేండ్లుగా కాల్వలొస్తాంటే రెండు పంటలు పండించిన. అదే ఆశతో యాసంగి సాగు చేస్తే పంట ఎండిపోయింది. కేసీఆర్ సార్‌కు రైతు బాధలు తెలుసు. ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఓటేసినందుకు నాకు నేను చెప్పుతో కొట్టుకుంటూ శిక్ష వేసుకుంటున్న. రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే దిక్కు.

**- వెన్నల శ్యాం, రైతు, రేగొండ**

# నాడు కాళేశ్వరం నీళ్లు.. నేడు రైతన్న కన్నీళ్లు

- నీరు లేక ఎండిపోతున్న రైతుల పంట పొలాలు
- 2 లక్షల రుణమాఫీ, పంట నష్టపరిహారం ఇవ్వాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- పెన్‌పహాడ్ మండలంలో రాయి చెరువు పరిశీలన

పెన్‌పహాడ్, మార్చి 27: 'గత ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయించి వందల కిలోమీటర్ల దూరంలో చిట్ట చివర ప్రాంతమైన పెన్‌పహాడ్ మండలానికి గోదావరి జలాలను తీసుకొచ్చి చెరువులను నింపారు. దీంతో పెన్‌పహాడ్ మండలంలోని రాయి చెరువు నాలుగేండ్లపాటు నీటితో కళకళలాడుతూ మత్తడి దుంకింది. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో వెలవెలబోతున్నది' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మినీ రిజర్వాయర్ గుర్తింపు ఉండి ఎండిపోయిన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మాచారంలోని రాయి చెరువును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాయి చెరువుతోపాటు చేతికొచ్చిన పొలాలు ఎండిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం, జిల్లా మంత్రులైన ఉత్తమ్, కోమటిరెడ్డి నిర్లక్ష్యమేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌పై కక్షతో చెరువులు నింపకుండా రైతులకు శిక్ష వేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటికీ నెరవేర్చలేదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన పిల్లర్లతో సంబంధం లేకుండా నీళ్లు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా పట్టించుకోలేదని, ఈ వంద రోజుల్లో కనీసం 50 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే పోచంపహాడ్ నుంచి పెన్‌పహాడ్ మండలానికి నీళ్లు వచ్చేవని, ఒక్క ఎకరం కూడా ఎండిపోయేది కాదని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన 3 లక్షల ఎకరాలు పూర్తిగా ఎండిపోయాయని, 2014 నాటి పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు వెంటనే రూ.2 లక్షల రుణ మాఫీ చేయడంతోపాటు రైతుబంధు, ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మాచారంలో ఎండిపోయిన రాయి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

# సంకటస్థితిలో రేవంత్!

- లిక్కర్ స్కామే లేదన్న ఢిల్లీ పెద్దలు
- వందల కోట్ల స్కామన్న రేవంత్‌రెడ్డి
- ఏఐసీసీ వైఖరికి భిన్నంగా సీఎం

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ సీఎం. ఆయన ఆ పార్టీ బాటలోనే నడుస్తున్నారా? లేక బీజేపీ బాటలో నడుస్తున్నారా? అన్నది ప్రజలకు, కాంగ్రెస్ నేతలకు అర్థం కాని గందరగోళ పరిస్థితి. ఎందుకీ పరిస్థితి అంటే.. ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలది ఒక మాట అయితే, సీఎం రేవంత్‌ది ఇంకో మాట. దీంతో అసలు కాంగ్రెస్ విధానం ఏమిటన్నది అర్థం కాకుండా ఉన్నది. ప్రతి అంశంలో రాజకీయ పార్టీకి ఒక లైన్ అనేది ఉంటుంది. పార్టీ వైఖరి ప్రకారమే నాయకుల స్పందన ఉంటుంది. అది ఆ పార్టీ కట్టుబాటు. ఏ స్థాయి నాయకుడైనా దానికి కట్టుబడి ఉండక తప్పదు. కానీ విచిత్రం ఏమిటంటే ఢిల్లీలో కాంగ్రెస్ విధానం ఒకలా ఉంటే, అందుకు విరుద్ధంగా రేవంత్ తీరు ఉన్నది. 'ఊరంతా ఒకదారి అయితే ఉలిపిరి కట్టది మరోదారి' అన్న చందంగా సాగుతున్న రేవంత్ వైఖరి పట్ల రాజకీయవర్గాలలో జోరుగా చర్చ జరుగుతున్నది.

### ఖర్గే, రాహుల్ ఓవైపు.. రేవంత్ మరోవైపు

ఢిల్లీ లిక్కర్ స్కాం అనేది ఒక రాజకీయ కుట్ర అని, కేంద్రంలో బీజేపీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా తమ రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తమ ఏఐసీసీ అగ్రనేతల అభిప్రాయానికి పూర్తి విరుద్ధంగా మాట్లాడుతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం జరిగిందని, రూ.వందల కోట్లు చేతులు మారాయని, ఈ స్కాంలో నిందితులను ముందే అరెస్టు చేసి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టులో జాప్యం ఎందుకు జరిగిందంటూ ఆయన ప్రశ్నించారు.

## కూటమి నేతల్లో స్పందించనిది ఒక్క రేవంతే

కేజ్రీవాల్ అరెస్టుపై 'ఇండియా కూటమి' భాగస్వామ్య పక్షాలు, సీఎంలు స్పందించి కేంద్రంలో బీజేపీ సర్కారును తప్పుబట్టాయి. కానీ దీనిపై స్పందించని విపక్ష నేతలు ఎవరైనా ఉన్నారా? అంటే అది రేవంత్‌రెడ్డి ఒక్కరే. కేజ్రీవాల్ అరెస్టును బీజేపీ నేతలు సమర్థిస్తున్నట్టుగా వారితో రేవంత్ ఏకీభవిస్తున్నారా? కాం గ్రెస్‌కు భిన్నంగా ఆయన తీసుకున్న వైఖరిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కాంగ్రెస్‌కు చెందిన సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ నేతల మాదిరి మాట్లాడటం ఏమిటని రాజకీయ విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



మెదక్ జిల్లా నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండాలో ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువే

- ప్రాజెక్టుల గేట్లు తెరిచి పంటలకు నీరందించాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్

చేగుంట, మార్చి 27: ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువేనని, సర్కారు వెంటనే స్పందించి ప్రాజెక్టుల గేట్లు తెరిచి కాలువల ద్వారా పంటలకు సాగునీరు అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండాలో సుమారు 1800 ఎకరాలకుపైగా ఎండిపోయిన వరి, మక్కజొన్న పంటలను బుధవారం కొత్త ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కరువొచ్చిందని, ఎండిన పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన రైతు భరోసా, రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు.

# 4 స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు

- ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, భువనగిరి స్థానాలకు ప్రకటన
- పెండింగులో మరో నాలుగు స్థానాలు

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి పార్లమెంటు బరిలో నిలిచే మరో నలుగురు అభ్యర్థులను కాంగ్రెస్ ఖరారు చేసింది. ఢిల్లీలో బుధవారం సాయంత్రం సమావేశమైన కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మెదక్ నుంచి నీలం మధు, నిజామాబాద్ నుంచి టీ జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి డాక్టర్ చెలిమల సుగుణకుమారి పేర్లను జాబితాలో పేర్కొన్నారు. ఆత్రం సుగుణకు బదులుగా పొరపాటున సుగుణకుమారి పేరు జాబితాలోకి వచ్చిందని పేర్కొంటూ తర్వాత సుగణ పేరుతో మరో జాబితాను విడుదల చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే 14 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కాంగ్రెస్ పార్టీ బుధవారం రాత్రి విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లో నాలుగు, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్‌లో చెరో మూడు స్థానాలకు కలిపి మొత్తంగా 14 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.

### పెండింగ్‌లో ఉన్నవి ఇవే

రాష్ట్రంలోని నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో మరో నాలుగు స్థానాలు పెండింగులో ఉన్నాయి. వాటిలో ఖమ్మం, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ ఉన్నాయి. ఈ నెల 31న జరిగే సమావేశంలో ఈ స్థానాలపైనా చర్చించనున్నట్టు తెలిసింది. ఏకాభిప్రాయం కుదరకపోవడంతోనే వీటిని పెండింగులో పెట్టినట్టు సమాచారం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం సాయంత్రం సీఈసీ సమావేశమైంది.

# కేటీఆర్‌పై నిజామాబాద్‌లో ఫిర్యాదు

వినాయక నగర్, మార్చి 27: సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ బుధవారం నిజామాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తాహెర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ అసత్యాలు మాట్లాడినట్టు తెలిపారు. మున్సిపల్ శాఖను తన వద్దనే ఉంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి డబ్బులు ఇస్తేనే బిల్డింగ్‌లకు అనుమతులు మంజూరు చేస్తున్నారని, అలా వసూలు చేసిన రూ.2,500 కోట్లను ఢిల్లీకి పంపించారని ఆరోపించడాన్ని ఆయన తప్పుబట్టారు.


# రాష్ట్రంలో దోపిడీ.. ఢిల్లీకి కప్పం!

- ప్రజాపాలన పక్కనెట్టి అవినీతి పాలన మొదలెట్టారు
- 100 రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు చెప్పారు
- హామీలు నెరవేర్చేదాకా కాంగ్రెస్‌ను వెంటాడుతాం
- సీఎం, మంత్రులపై చీటింగ్ కేసు నమోదు చేయాలి
- పాలమూరుకు నీళ్లు ఎవరిచ్చారో చర్చకు సిద్ధమా?
- మంత్రి జూపల్లిపై బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మంత్రుల దొంగల ముఠాగా మారి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఆస్తిని కాంగ్రెస్ నేతలు హస్తినకు దానం చేస్తున్నారని విమర్శించారు. రూ.2,500 కోట్లు ఢిల్లీకి కప్పం కట్టారని అన్నారు. ఈ ప్రభుత్వానికి అభివృద్ధిపై ధ్యాస లేదని, అవినీతిపైనే ఉన్నదని విరుచుకుపడ్డారు. ప్రజాపాలన పక్కకు పెట్టి అవినీతి పాలనను మొదలుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంపై విచారణ అంటూ కొంతసేపు, ఫోన్ ట్యాపింగ్ అంటూ కొంతసేపు కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు.

### జూపల్లిది రెండు నాల్కల ధోరణి

కేసీఆర్, హరీశ్‌రావుపై మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను ఎర్రోళ్ల తీవ్రంగా ఖండించారు. 'మంత్రి జూపల్లి కృష్ణారావు గతంలో ఉద్యమంలో పాల్గొన్నారన్న గౌరవం ఉండేది. కానీ, ఇప్పుడు ఆయన రెండు నాల్కల ధోరణి అర్థమవుతున్నది. విమర్శలు చేసేముందు ఆత్మవిమర్శ చేసుకోవాలి. కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశానన్న సంగతి ఆయన మర్చిపోయారు. ఐదేండ్లు మంత్రిగా పాలమూరుపై గుత్తాధిపత్యం చెలాయించారు. నాడు మంత్రిగా కేసీఆర్‌ను ఎంత పొగిడారో గుర్తు చేసుకోవాలి. ఆ మాటలు వింటే జూపల్లి తన తలకాయను ఎక్కడ పెట్టుకుంటారు?' అని మండిపడ్డారు. పాలమూరుకు కరువును కేసీఆర్ శాశ్వతంగా దూరం చేశారని, కేసీఆర్ పాలన కంటే ముందు, తర్వాత పాలమూరు జిల్లా ఎలా ఉన్నదో ఒక్కసారి పరిశీలించుకోవాలని హితవు చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుల కింద కేసీఆర్ హయంలో 6 లక్షలకుపైగా ఎకరాలకు నీళ్లిచ్చిన సంగతి తెలియదా? అని ప్రశ్నించారు. పాలమూరుకు కేసీఆర్ నీళ్లిచ్చారా? 50 ఏండ్లలో, 100 రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చిందా? అన్న చర్చకు సిద్ధమా? అని జూపల్లికి సవాల్ విసిరారు. రేవంత్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై చర్చకు సిద్ధమా? అని నిలదీశారు. రుణమాఫీ హామీపై కాంగ్రెస్ సర్కారు చేతులెత్తేసిందని, 100 రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు ఆడారని ఆరోపించారు. హామీలు అమలుచేయని సీఎం రేవంత్, క్యాబినెట్‌పై చీటింగ్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా కాంగ్రెస్‌ను వెంటాడి, వేటాడుతామని హెచ్చరించారు. కేసీఆర్ సమస్యలు లేకుండా చేసినందువల్లే ప్రతిపక్షాలకు ధర్నా చేసే అవకాశం రాలేదని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజలను మోసం చేయాలని సీఎం రేవంత్ చూస్తున్నారని, ప్రజల పక్షాన పోరాడి కాంగ్రెస్ అంతు తేలుస్తామని ప్రకటించారు.



తెలంగాణభవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతుతున్న బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్. చిత్రంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్

### కాంగ్రెస్‌తోనే కరువొచ్చింది: దేవీప్రసాద్

కాంగ్రెస్ రాగానే కరువు కూడా వచ్చిందని ఉద్యోగ సంఘాల నాయకుడు దేవీప్రసాద్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఇబ్బందులు లేవని తెలిపారు. కాంగ్రెస్ 100 రోజుల పాలనలో ఒక్క హామీ నెరవేరలేదని, రైతుల హామీలు ఎక్కడివి అక్కడే ఉన్నాయని విమర్శించారు. 'రైతుబంధుపై మంత్రులు పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. రైతు రుణమాఫీ ఊసే లేదు. 3 ఎకరాల్లోపు రైతులకు ఇంకా రైతుబంధు అందలేదు. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో భట్టి, రుణమాఫీపై జూపల్లి మాట్లాడిన తీరు ఏరు దాటాక తెప్ప తగిలేసినట్టుగా ఉన్నది' అని వెల్లడించారు. 170 మండలాల్లో 20 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వం దృష్టికి తెచ్చారని, ఆ వాస్తవాలు చెప్పకుండా ప్రభుత్వం ఎదురుదాడి చేస్తున్నదని విమర్శించారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18,300 కోట్లు అప్పు తెచ్చిందని, ఈ అప్పు ఏం చేశారని ప్రశ్నించారు. పాలన మీద దృష్టి పెట్టకుండా హరీశ్‌రావుపై జూపల్లి అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. హరీశ్‌రావు ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ఎప్పుడూ ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి మెప్పు కోసమే జూపల్లి విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.